
క్లుప్తంగా

విద్యుత్ లైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని కంభాలపాడు-ఓబులక్కపల్లి పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తెగిపడిన విద్యుత్ లైన్‌కు ఆ శాఖ అధికారులు ఎట్టకేలకు మరమ్మతులు చేశారు. ఈ నెల 24న విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి పరాకాష్ట శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెట్లను తొలగించారు. తెగిపడిన విద్యుత్ లైన్‌ను బాగు చేయడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ కంట్రోలర్‌కు మరమ్మతులు చేసినట్లు ఏడీఈ కీసరి శ్రీనివాసులు తెలిపారు.


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

ఫీవర్ సర్వే త్వరగా పూర్తి చేయాలి

పుల్లలచెరువు: ప్రభుత్వం సూచించిన ఫీవర్ సర్వేను వలంటీర్లు త్వరగా పూర్తి చేయాలని ఈవోఆర్డీ బాలునాయక్ అన్నారు. మంగళవారం ఆయన గ్రామాల్లో జరుగుతున్న ఫీవర్ సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి వలంటీర్, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు తనకు కేటాయించిన ఇళ్లలో సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వే పూర్తి చేయని వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

పుల్లలచెరువు: పాఠశాలల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించే విధంగా కృషి చేయాలని ఎంఈవో శామ్యూల్ జాన్ కోరారు. మంగళవారం పీవీపల్లి జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న గణితం కాంప్లెక్సు సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కాంప్లెక్సు సమావేశాలు ప్రభుత్వం మంచి ఉద్దేశంతో నిర్వహిస్తోందని, గణితం విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని చెప్పారు. గణితం సబ్జెక్టుపై సమావేశంలో నేర్చుకున్న అంశాలు విద్యార్థులకు ఉపయోగపడేలా ఉండాలన్నారు.

నేటి నుంచి అంబవరం రైల్వే బ్రిడ్జి రోడ్డు మూసివేత

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న అంబవరం రైల్వే బ్రిడ్జి రోడ్డును బుధవారం నుంచి ఆగస్టు 20వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే డంబ్లింగ్ పనుల్లో భాగంగా అంబవరం రైల్వే బ్రిడ్జి వద్ద పనులు చేయనున్న నేపథ్యంలో అంబరం గ్రామ వైపు వెళ్లే జయరాంపురం, జయరాంపురం తండా, వెల్లుపల్లె, వెంగళ్‌రెడ్డిపల్లె గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

మిస్సింగ్ కేసు నమోదు

దర్శి: లింగాల నాగరాజు అనే (19) యువకుడు కనిపించలేదని తండ్రి లింగాల చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రామకృష్ణ మంగళవారం కేసు నమోదు చేశారు. మేళం వాయించేందుకు నాగరాజు వెళ్తుంటాడు. అందులో భాగంగా ఆటో ఎక్కి దర్శికి వెళ్లిన తర్వాత ఇంటికి రాలేదు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ముండ్లమూరు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ సీహెచ్ హనుమంతరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నరు. మండల పరిషత్ పరిపాలనా అధికారి ఎస్‌వీఎల్ హనుమంతరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే స్వాగత బోర్డును ఢీకొన్న లారీ

దొనకొండ: దొనకొండ రైల్వే స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన స్వాగతం బోర్డును పత్తి లోడు లారీ ఢీ కొట్టిన సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. కడప ప్రాంతానికి చెందిన లారీ కనిగిరి ప్రాంతంలో పత్తి లోడు వేసుకుని దొనకొండ మీదుగా గుంటూరు వెళుతోంది. లారీ డ్రైవరుకు దారి అవగాహన లేక పోవటంతో స్థానిక అడ్డరోడ్డు నుంచి గుంటూరుకు వెళ్లకుండా దొనకొండ టౌన్‌లోకి వచ్చి రైల్వే స్వాగతం బోర్డును బలంగా ఢీ కొట్టడంతో విరిగి పోయింది. కానిస్టేబుల్ లారీని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. రైల్వే రక్షక దళం ఏఎస్ఐ క్రాంతికుమార్ కేసు నమోదు చేశారు.

నీటి వనరులపై అవగాహన

దొనకొండ: మండలంలోని ఆరవల్లిపాడులో రిలయన్స్ ఫౌండేషన్ ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్తులకు నీటి వనరులపై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. బి.జెస్సీగ్లోరీ, సుధారాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలు అరికట్టాలి


బేస్తవారిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్‌లు


వై.పాలెంలో ర్యాలీ చేస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

బేస్తవారిపేట: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, హింసాత్మక ఘటనలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టి, హింసకు పాల్పడిన వ్యక్తులు, సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల పాస్టర్లు, క్రైస్తవ సంఘాలు, జమాఅతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక సెంటినరీ తెలుగు బస్టిస్ట్ చర్చి నుంచి తహసీల్దార్ కార్యాలయం వద్దకు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం జరుగుతున్న సంఘటనలను అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని, రాష్ట్రపతి పాలన విధించాలని కోరారు. హింసాత్మక అల్లర్లలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తాతపూడి ఐజయ్య, మండల ఉపాధ్యక్షురాలు గుంటి స్వప్న, పాస్టర్‌లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మణిపూర్ మానవ మృగాలను ఉరి తీయాలి

యర్రగొండపాలెం: మణిపూర్‌లో గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసిన మానవ మృగాలను ఉరితీయాలని మంగళవారం పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్స్ అసోసియేషన్, క్రైస్తవ నాయకులు, సీపీఐ, బీఎస్పీల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో క్రైస్తవుల మనుగడ కష్టంగా మారిందని వారు విమర్శించారు. ఆయా కార్యక్రమాల్లో పాస్టర్స్ అసోషియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.విజయకుమార్, సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, డి.శ్రీనివాస్, కేవీ కృష్ణగౌడ్, బీఎస్పీ నాయకుడు ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో చర్చ జరపాలి

దర్శి: మణిపూర్ ఘటనపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం. రమేష్ బాబు కోరారు. మణిపూర్ బాధితులకు మద్దతులగా మంగళవారం నిరసన ర్యాలీ చేశారు. మణిపూర్ ముఖ్యమంత్రి వీరేంద్రసింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె. హనుమంతరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి జూపల్లి కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్. కరుణానిధి, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎస్. రామాంజి పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



ముండ్లమూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ముండ్లమూరు: మణిపూర్‌లో జరుగుతున్న హింసను అరి కట్టేందుకు వెంటనే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యలయం వద్ద మంగళవారం మాట్లాడుతూ ఆదానికి అడవులను ధారాదత్తం చేయాలనే లక్ష్యంతో కుకి నాగ తెగలను విచక్షణా రహితంగా చంపుతున్నారన్నారు. సీపీఎం నాయకులు బొడ పాటి హనుమంతరావు, ఎర్రయ్య, పంటా ఏడుకొండలు, మీరావలి, శ్రీను పాల్గొన్నారు.

ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- ఎమ్మెల్యే కేపీ సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి


కృష్ణమోహన్‌రెడ్డి

మార్కాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం, తమ కుటుంబం మీద మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేసిన ఆరోపణలపై బహిరంగంగా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం తోపాటు, నీవు ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో మార్కాపురం నియోజకవర్గంలో అన్యాయాలు, అక్రమాలు, అవినీతి, భూ దందా, భూ కబ్జాల తోపాటు పొదిలిలో లోకేష్ చేసిన ఆరోపణలపైనా బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. గడిచిన నాలుగేళ్లలో మార్కాపురం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, హిమ్‌లో కందులపై వచ్చిన ఆరోపణలపైనా చర్చిద్దామన్నారు. చర్చకు నీవు రాకపోతే ఎవరినైనా పంపవచ్చని, ప్లేసు నువ్వు చెప్పినా లేదా నీ ఇంటికి రమ్మన్నా చర్చకు వస్తానని కందులకు కృష్ణమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. గడిచిన నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మార్కాపురం నియోజకవర్గం ఎలా అభివృద్ధి చెందిందో అందరికీ తెలుసన్నారు. ఇప్పటికైనా నిరాధారమైన ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.

సజ్జ సాగులో అధిక దిగుబడులు సాధ్యం



శివరామపురంలో పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ ప్రసాదరావు

తాళ్లూరు (ముండ్లమూరు): సజ్జ పంట సాగు చేసిన రైతులు సమగ్ర పంట సాగు పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొంద వచ్చని మండల వ్యవసాయాధికారి బి. ప్రసాదరావు తెలిపారు. శిరామపురంలో మంగళవారం పలు సూచనలు చేశారు. వీఏఏ రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ రాందాస్‌నాయక్

మార్కాపురం: ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలతో విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలని ఎంఈఓ రాందాస్‌నాయక్ సూచించారు. స్థానిక డాక్టర్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులకు రెండురోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఇంటరాక్టివ్ ఫ్లాట్‌ప్యానెల్స్, డిజిటల్ ఎడ్యుకేషన్, స్మార్ట్ టీవీ, బైజూస్ ఇ-కంటెంట్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజక వర్గాలకు చెందిన మొత్తం 1500 మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వివిధ దశల్లో శిక్షణ పొందారని చెప్పారు. మొత్తం 10 బ్యాచ్‌ల్లో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు ఆధునిక పద్ధతుల్లో బోధించాలని సూచించారు. కార్యక్రమంలో సీఎస్ఈ హెచ్ఓడీ డాక్టర్ పీపీఎస్ నాయక్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రాజబాబు, ప్రొఫెసర్లు కుమార్, పి.శ్రీనివాసులు, భూలక్ష్మి, కె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ భవనానికి రూ.75 వేల వితరణ


నగదు అందజేస్తున్న మందాది సుబ్బారావు

దర్శి: పట్టణంలోని యూటీఎఫ్ భవనం నిర్మాణానికి మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ నాయకులు శిద్దా రాఘవరావు రూ.75 వేల ఆర్థిక సాయం అందించారు. శిద్దా రాఘవరావు ప్రతినిధులు మందాది సుబ్బారావు, కంచర్ల శ్రీనుల చేతుల మీదుగా ఈ సాయాన్ని అందించారు. యూటీఎఫ్ నాయకులు శిద్దాకు కృతజ్ఞతలు తెలిపారు. నేతలు డి. వెంకటరెడ్డి, మీనిగ శ్రీను, ఖాశీం, వెంకటేశ్వర్లు, టి. చెంచయ్య, జేవీవీఎం సుధాకర్, టి. రాజశేఖర్, ఎస్. తిరుపతిరెడ్డి, ఇ. రోశయ్య, వి. రామిరెడ్డి, కమ్మ శ్రీను, ఏ. రామారావు, బి, రామాంజనేయులు, కె. మాలకొండయ్య, బీకోటిరెడ్డి, ఎంవీ రమణారెడ్డి, కె. విజయభాస్కర్, జి. విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ వెంకటనాయుడు

కొమరోలు: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు తెలిపారు. మండలంలోని తాటిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో విడత పాఠ్యపుస్తకాలను మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించారు. మాజీ సర్పంచ్‌లు బాదం వేణుగోపాల్, అలెగ్జాండర్, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటేశ్వర్లు, జనార్దన్, ప్రధానోపాధ్యాయుడు నాగేషు పాల్గొన్నారు.

326 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ బ్రహ్మానందరెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో గిద్దలూరుకు చెందిన బ్రహ్మానందరెడ్డి వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 326 మందికి వైద్య పరీక్షలు చేశారు. కంటికి సంబంధించి 67 మందికి శస్త్ర చికిత్సలు, 11 మందికి ఈఎన్‌టీ, సాధారణ శస్త్రచికిత్సలు 9 మందికి అవసరమని గుర్తించినట్లు వైద్య నిపుణులు తెలిపారు. డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భవిత విద్యార్థులకు దుస్తుల వితరణ


విద్యార్థులకు స్వెట్టర్లు అందజేస్తున్న ఎంఈఓ శ్రీనివాసరెడ్డి

పొదిలి రూరల్: పొదిలి భవిత విద్యా కేంద్రంలోని చిన్నారులు 20 మందికి పట్టణానికి చెందిన దాత గుడిపూడి మోజెస్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గుడిపూడి మైఖేల్ మంగళవారం స్వెట్టర్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. దాతను ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి అభినందించారు. ఎంఈఓ-2 నాగలక్ష్మి, సీఆర్పీ గాదె వెంకట సుబ్బారెడ్డి, భవిత కేంద్రం ఉపాధ్యాయులు కె.గోపాలకృష్ణ, ఎస్‌కే షహీదా బేగం పాల్గొన్నారు.

తైక్వాండో విజేతలకు అభినందన


విజేతలను అభినందిస్తున్న నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: లక్నోలో ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటిన రాక్‌వెల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను డైరెక్టర్ వెన్నా నాగార్జునరెడ్డి, సింధూజ అభినందించారు. మంగళవారం స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ఈనెల 16న విజయనగరంలో రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో విద్యార్థులు సాత్విక, నిఖిల్, హిమవర్షిణి, పార్థు పాల్గొన్నారని తెలిపారు. 152 సెం.మీ విభాగంలో నిఖిల్, 164 సెం.మీ విభాగంలో సాత్విక రెడ్డి గోల్డ్‌మెడల్ సాధించి లక్నోలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించినట్లు వివరించారు. కోచ్ ముఖేష్‌కుమార్‌ను కూడా అభినందించారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

పామూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారి ప్రైవేట్ పాఠశాలలను దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని ప్రభుత్వ పాఠశాలల బుక్స్ అండ్ స్టేషనరీ రాష్ట్ర డైరెక్టర్ కొండా రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇనిమెర్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం మధ్యాహ్నం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథక మెనూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠ్యాంశాల బోధనలో అవలంబించాల్సిన తీరుపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పాఠశాలలో హాజరుశాతం పెంచాలన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలుగుతూ విద్యాభ్యాసం చేసేలా తీర్చిదిద్దాలన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో వసతులను ఆయన పరిశీలించి పాఠశాలలోని విద్యార్థులకు విద్యాకానుక, అమ్మఒడి పథకాల లబ్ధిపై హెచ్‌ఎం అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మన్నే హరనాథరెడ్డి, మేకల శ్రీనివాసులు, షేక్.ఖాజామొహిద్దీన్, సిద్ధమూర్తి లక్ష్మిరెడ్డి ఉన్నారు.

అర్హులైన దివ్యాంగులకు రుణాలు

మర్రిపూడి: దివ్యాంగులకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేయనుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ బ్రహ్మయ్య మంగళవారం తెలిపారు. 18 నుంచి 60 ఏళ్లలోపు ఉండి 40 శాతం అంగవైకల్యం ఉన్న దివ్యాంగులకు నామమాత్రపు వడ్డీతో వాణిజ్య, వ్యాపార, సేవా రంగాల్లో జీవనోపాధి మెరుగుపరుచుకోవడానికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని చెప్పారు. మూడు నుంచి ఐదేళ్లలో 6 శాతం వడ్డీతో తిరిగి చెల్లించేలా రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణం అందించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన దివ్యాంగులు నిర్ణీత దరఖాస్తును జిల్లా వెబ్‌సైట్ ఎస్ఐపీ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఆగస్టు 8 తేదీలోగా ఒంగోలులోని విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 08592 281310ను సంప్రదించాలని కోరారు.

డిజిటల్ తరగతులపై అవగాహన కల్పించాలి

హనుమంతునిపాడు: విద్యా విధానంలో నూతనంగా వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు బోధన అందించాలని ఎంఈఓలు జి. పెద్దిరాజు, ఎస్.రమణయ్య, కాంప్లెక్స్ చైర్మన్ జీవి.సురేష్‌బాబులు అన్నారు. హెచ్ఎంపాడు, చిన్నముప్పళ్లపాడు, నందనవనం కాంప్లెక్స్‌లో మంగళవారం కాంప్లెక్స్ తరగతులు నిర్వహించారు. మాట్లాడుతూ విద్యా విధానంలో వచ్చిన నూతన మార్పులతో అభ్యసన పద్ధతులు ఆధారంగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన అందించాలన్నారు. డిజిటల్ తరగతులపై ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాలని సూచించారు.

మినీ లారీ బోల్తా .. తప్పిన ప్రమాదం


బోల్తా పడిన మినీ లారీ

ముండ్లమూరు: మండలంలోని వేంపాడు చిలకలేరు వద్ద అదుపు తప్పి కూరగాయల లోడ్‌తో వెళుతున్న మినీ లారీ బోల్తా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. మంగళవారం గుంటూరు నుంచి మార్కాపురం వెళుతున్న మినీ లారీ దర్శి - అద్దంకి ప్రధాన రహదారిలో వేంపాడు చిలకలేరు వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడింది.

పాలకేంద్రాల బలోపేతమే లక్ష్యం

తాళ్లూరు (ముండ్లమూరు): గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన అమూల్ పాల కేంద్రాలను బలోపేతం చేయాలని వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బందిని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వై. శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం జగనన్న పాల కేంద్రాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఏపీఎం దేవరాజ్, సీసీలు కోటేశ్వరమ్మ, సుచేంద్ర, వీఓఏలు పాల్గొన్నారు.

మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి


మొక్క నాటుతున్న డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, ఎంపీపీ భూలక్ష్మి

తర్లుపాడు: మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని డీఆర్‌డీఏ పీడీ రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కేతగుడిపి పంచాయతీలో సర్పంచ్ దూదేకులపెద్ద మస్తాన్ అధ్యక్షతన పచ్చదనం పరిశుభ్రత, పౌష్టికాహారం, ఆహార భద్రతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ గ్రామంలో ప్రతిఒక్కరూ తమ ఇంటిముందు మొక్కలు నాటి సంరక్షించాలని, భవిష్యత్తులో అవే మనకు ప్రాణదాతలుగా నిలుస్తాయన్నారు. కేతగుడిపి పంచాయతీ ఆదర్శ పంచాయతీగా నిలుస్తోందని ఎంపీపీ భూలక్ష్మి పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా గ్రామాభివృద్ధికి సహకరిస్తున్నాయన్నారు. ఆల్ఫా గ్లోబల్ మినిస్ట్రీస్ ప్రతినిధి విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. 30 మంది పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందిస్తామని ప్రకటించారు. గ్రామంలో 3 వేల మొక్కలు నాటుతున్నట్లు సర్పంచ్ పెద్ద మస్తాన్ తెలిపారు. కార్యక్రమంలో గజ్జలకొండ మెడికల్ ఆఫీసర్ కిశోర్‌కుమార్‌రెడ్డి, ఏపీఎం పిచ్చయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్.రామసుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనర్ మల్లారెడ్డి, పార్టీ నాయకులు రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జామ పెంపకంలో యాజమాన్య పద్ధతులు


రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త శివ

దర్శి: జామ పంటలో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన వన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. శివ సూచించారు. కొర్లమడుగులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ రమణారెడ్డి, డీబీఆర్‌సీ మండల కోఆర్డినేటర్ నాగమణి పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం


దివ్యాంగులకు అన్నదానం చేస్తున్న దాత

మార్కాపురం: దివంగత న్యాయవాది లక్కాకుల లక్ష్మీనారాయణ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక స్ఫూర్తి వెల్ఫేర్ దివ్యాంగుల పాఠశాలలోని సుమారు 70 విద్యార్థులకు అన్నవితరణ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఏపీపీ ఉమ్మడి రవీంద్రనాథ్, న్యాయవాది బత్తుల వేణు మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో లక్ష్మీనారాయణ పేద ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎల్.సుమంత్‌కుమార్, ప్రణయ్‌కుమార్, ఎస్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.